# ముప్పై ఏళ్ళ మధన మనిషి



నక్కగడితుల మల్లికార్జునరావు

బస్సు స్టేండు ఆవలించి కళ్ళు తెరిచింది.

కొంప లారి పోతున్నట్లు తెల్లవారకముందే బస్సులకోసం అక్కడికి వచ్చిన జనం స్థలం కోసం తోసుకొంటున్నారు.

ఏడున్నర అయ్యేసరికి ఆ వూరునుంచి పోయే బస్సులన్నీ స్టేండు వదుల్తాయి. మళ్లీ ఎనిమిది న్నరకు ఆ వూరు చేరే బస్సులు రాక ప్రారంభం.

సూర్యుడు తాపీగా పైకి వస్తున్నాడు. ఊరు యింకా మత్తుగా జోగుతోంది.

కిల్లీకొట్టు కిష్టయ్యకు పొక్క-క్షణం తీరటం లేదు. ఒక చేత్తో కిల్లీలను కట్టిస్తున్నాడు. మరో

చేత్తో సిగరెట్లు. బీడీలు. పొగాకుకాడలు అందిస్తున్నాడు. అవసరమైనప్పుడు రెండుచేతుల్తో సోడాలు లాగించేస్తున్నాడు. నాలుగు చేతులా కలెక్షన్ చేసుకునే టైం అదేమరి.

అయితే అతని కళ్ళు మాత్రం ఆశగా అన్ని వైపులా వెదుకుతున్నాయి.

కిష్టయ్యకు కిళ్లీలు కట్టటం. బీడీలు సిగరెట్లు అందించటం అలవాటైన విద్య. అతని నిమిత్తం లేకుండా అతనిచేతులు అలవాటైన ఆ పనులు చేయగలవు.

కాని అతనికి ఆలోచించటం అంటే—ధనార్జన విషయాన్ని మినహాయిస్తే—అంతగా తేలీదు.

అయితే యివాళ ఆలోచించటం అనేపదార్థం స్వరూపం అతనికి తెలిసింది.

ఎంత వద్దనుకున్నా మనసు ముష్టి వాడి పైకి మళ్ళుతూనేవుంది.

ఆఖరిసారిగా బస్సుస్టేండు నంతా కలియచూచి 'ఉహు...యివాళా రాలేదు' అనుకున్నాడు నిరాశగా.

ఊరు వళ్లు విరుచుకొంది

బస్సులు వొక్కొక్కటే రోడ్డెక్కి పరుగెత్తుతున్నాయి.

జనం క్రమంగా పల్చబడ్డారు.

బస్సు స్టేండు కూడా కళ్ళు తెరవకముందే ఆ ముష్టివాడు అక్కడికి చేరుకుంటాడు. ప్రయాణీకుల షెడ్డులో పడుకున్న వాళ్లను ఒక్కొక్కర్నీ లేపి. బస్సుకు టైం అవుతోందని, కాఫీలు తాగిరమ్మని హుషారిస్తాడు.

కిష్టయ్య రాగానే తాళంచెవులు తీసకొని కిల్లీకొట్టు తలుపులు తీస్తాడు. సోడా తొట్టిలో నీళ్లు నింపుతాడు.

అప్పటికి మొదటి బస్సు.స్టేండులోకి వస్తుంది. కిష్టయ్య యిచ్చిన బీడీముక్క కాల్చుకొంటూ తన పనిలోకి తను వెళ్తాడు ముష్టివాడు.

అతని పేరేమిటో తెల్సుకోవాలన్న ఆలోచనే ఎవరికీ యింతవరకు రాలేదు. వృత్తిచేత సంక్రమించిన పేరే రూఢి వర్చారంతా. అతని దేవూరో, ఎక్కడినుంచి వచ్చాడో ఎవరికీ తెలియదు.

అందరికీ తెల్సిందొక్కటే. అతనుచిన్నతనం నుంచి యీ వూళ్లోనే ముష్టెత్తుకొంటూ బతుకుతున్నాడని.

ఆ ముష్టివాడికి వయసెంతో కూడా కరెక్టుగా చెప్పడం కష్టం.

దాదాపు అరవై ఏళ్ళు వుంటాయని అందరూ అనుకొంటారు. అతని మొహంలోని భావాలు చదవడం కష్టం. గిరజాలు తిరిగిన పెద్ద జుట్టు. పెద్ద గడ్డం. యింతేసిమీసాలు.. వీటన్నిటిమధ్య అతని సంతోషం, దుఃఖం, అన్ని అనుభూతులు బంధీకృతమై వున్నాయి.

కొత్తగా ఆతన్ని చూసినవారు అతన్ని పిచ్చివాడనుకొనే ప్రమాదం లేకపోలేదు, దానిక్కారణం—అతని వస్త్రధారణ.

అతనెప్పుడూ నీరుకావి పట్టిపోయిన ఆ బట్టల్లోనే వుంటాడు. చినిగిపోయిన ఆ బట్టలనుంచి గుడ్డ పేలికలు మూటలు వేలాడుతుంటాయి. ఆ మూటలు పెరగటమేకాని తరగటంలేదు.

ఆ ముష్టివాడిని ఉన్నప్పటినుంచి చూస్తున్నవారు అతని వొంటిమీద మొట్ట మొదటి మూట ముప్పై ఏళ్ళక్రితం చూశామంటారు. ఇప్పటికతని వంటి మీద ముప్పై మూటలకి పైగానే వ్రేలాడుతున్నాయి.

ఆ మూటల్లో ఏమున్నాయన్నది ఎవరికీ తెలియదు. అతన్నడిగితే నవ్వుతాడుకాని సమాధానమీయడు.

వృత్తి అడుక్కోటమే అయినా అది క్రమబద్ధమైనది.

పొద్దున బస్సు స్టేండులో — మధ్యాహ్నం కోర్టు దగ్గర — సాయంకాలం రైలు స్టేషను దగ్గర— టైం ప్రకారం అతన్ని చూడవచ్చు.

అతని కావూళ్లో ప్రతి వొక్కరూ తెల్సు. అతన్ని చాలామందికి తెల్సనే చెప్పవచ్చు. చిత్రమేమిటంటే వూరివాళ్ళని నోరు తెర్చి దమ్మిడీ, అడగడు. పిల్చి యిస్తే కాదనడు.

అతని బిజినెస్సంతా పరాయి వూళ్ల నుంచి ఆ వూరికి పనులమీద వచ్చినవాళ్ల తోనే.

అదీ ఎట్లా? వొకసారి అడిగిన వాడిని మళ్లీ అడగడు. ఒకసారి కాదన్న వాడిదగ్గర రెండోసారి లాగకుండా వదలడు.

ఒకసారి చూచిన వ్యక్తిని సాధారణంగా మర్చిపోడతను. మళ్లీ కన్పించినప్పుడు పలుకరించి క్షేమ సమాచారా లడుగుతాడు. వాళ్లని మంచి చేసుకొంటాడు. వాళ్లు యిచ్చింది తీసుకొంటాడు.

అతనా వూరిమీద ఆధారపడేది తిండికి మాత్రమే.

వెళ్లిన యింటికి మళ్లీ వెంటనే వెళ్లడు, యీవాళ వో వీధికి వెళ్తే మళ్లీ ఆవీధికి ఎప్పటికో వెళ్ళటం.

'అమ్మా అన్నపూర్ణమ్మా...యియాల నీచేతి వణ్ణం తినాలని వచ్చా తల్లీ...దయ తల్చు ..' అంటాడు. యింటి ముందు నిలబడి.

ఆయింటి యిల్లాలు దయతల్చి కడుపునిండా పెట్టినా తింటాడు. కవళం వేసినా సరిపుచ్చుకొంటాడు. లేదుపొమ్మన్నా మంచినీళ్లుతాగి వెళ్లిపోతాడు. కాని మరో యింటి ముందు నిల్చోడా పూటకి.

ఎవరైనాపిల్చి 'ఒరేయ్ అబ్బీ ఆపనిచేయరా' అంటే కాదనకుండా చేస్తాడు. ప్రతిఫలం ఆశించడు.

పిల్లలు కొందరతన్నిచూచి భయపడితే, మరికొందరు వేళాకోళం చేస్తారు. మరికొందరు దయతల్చి పైసా చేతిలో పెట్టబోతారు.

అయితే అతను పిల్లల దగ్గర డబ్బులు తీసుకోలేదెన్నడూ. కాగా పేదపిల్లలు కంటబడితే పిల్చి చాకలెట్లు కొని పంపటం చాలా మంది చూచారు.

మూడేళ్ళక్రితం వరకు అతని జీవితం యిలా సాఫీగా జరిగిపోయింది. అన్ని ద్వేషించినవారు లేకపోయారు ఆ వూళ్లో.

కానిమూడేళ్ళక్రితం అతనికి జ్వరంవచ్చింది, మూసిన కన్ను వారం రోజులపాటు తెరవలేదు,

అప్పుడో చిత్రం జరిగింది—

అలా పుట్టిందో మాట–ముష్టి వాడి దగ్గర వేలకు వేలు మూలుగుతోందన్న పుకారు పుట్టింది. ఆ పుకారు నమ్మకపోవటానికి ఆధారాలు కన్పించలేదెవరికీ–

కాకపోతే యిన్నేళ్ళ జీవితంలో సంపాదించిందంతా ఏమైనట్లు? కడుపు నింపుకొన్నది ఆ యింటా యీ యింటా యాచించే, కాఫీలు తాగినా బీడీలు కాల్చినా అంతా వుల్ఫానే, మరి రెండు చేతులా సంపాదించాడాయి. ఆ డబ్బంతా తినటానికి 'నా' అన్న వాళ్లెవరూ లేరాయె. ఏమయినట్లా డబ్బంతా.

కొందరు బ్యాంకులో వేశాడన్నారు. మరి కొందరు పాడుపడ్డ సత్రంలో భూమిలో పాతి పెట్టేడన్నారు, వేరె కొందరు అతని వొంటిమీద వేలాడే మూటల్లో వున్నవన్నీ నోట్ల కట్టలే నన్నారు,

ఇంకా? యీ వార్త ఆవూరి ప్రముఖులదాకా వెళ్లింది.

ఆ వూరి పాలకవర్గంలో ఎన్నో ముఠాలున్నాయి ఎలక్షన్లు సమీపిస్తున్న తరుణంఅది. ఎవరికి వారు ప్రజోపకరమైన కార్యాలు చేసేమని నిరూపించటానికి పోటీలు పడుతున్నారు.

ఒక ముఠావారు ఆ వూళ్లో కాలేజీ పెట్టించటానికి సన్నాహాలు చేస్తూ అందుకు అవసరమైన నిధిని సమకూరుస్తున్నారు

ఇంకో ముఠావారు శివాలయం కట్టటానికి సన్నాహాలు చేస్తూ చందాలు వసూలు చేస్తున్నారు–దేముడి పేరిట.

మూడో ముఠావారు వారి వర్గానికి కేంద్రంలో నాయకుడైన వ్యక్తి శిలావిగ్రహాన్ని ఆవూరి నట్టనడిబజారులో (దారికడ్డంగా) ప్రతిష్ఠించటానికి తీర్మానించి, ధన సేకరణకు వొకమిటీని వేశారు.

మూడు ముఠాలవారికి ముష్టి వాడి దగ్గర వున్నడబ్బు విషయం తెల్సింది. ఆధనాన్ని తాము తలపెట్టిన కార్యానికే సంపాదించాలని మూడు వర్గాలూ నిర్ణయించాయి.

ఒక శుభ ముహూర్తాన — రాత్రి వేళ ఎవరూ చూడకుండా—వొక వర్గం వారికి తెలీయకుండా వొకరు–మూడు వర్గాలవారు ముష్టివాడు పడుకొనే చోటికి చేరుకొన్నారు.

నిజానికి ముష్టి వాడికి పడుకోటానికోచోటంటూలేదు. ఎక్కడ నిద్రవస్తే అక్కడే పడుకోటం. ఎక్కడ పడుకొన్నా అతన్ని అడిగేవారులేరు.

అయినా అవ్వూళ్లో అతనికి ముఖ్యులన్న దగ్గవారు ముగ్గురున్నారు.

బస్సు స్టేండు దగ్గర కిల్లీకొట్టు కిష్టయ్య—

# ముష్టివాళ్ళమధ్య మనిషి

కోర్టు దగ్గర సైకిల్ షాపు మాలీషా — రైలు స్టేషను దగ్గర కాకా కొట్టు జాను.

సాధారణంగా అతను యీమూడు ప్రదేశాల్లో పడుకొంటుంటాడు.

కాని ఎంచేతనో యీ జ్వరం వచ్చిన రోజు పాడుపడ్డ సత్రంలో పడుకొన్నాడు. ఆసత్రంలో సాధారణంగా బిచ్చగాళ్లుకూడాపడుకోరు. దయ్యాలున్నాయని ప్రతీతి.

ముష్టివాడు అక్కడ పడుకోటమన్నది. అతనిదగ్గర డబ్బున్నదన్న అనుమానాన్ని ధృవం చేసింది. డబ్బంతా ఆపాడుపడ్డ సత్రంలోనేదాచాడని, చావబోయేముందు కూడబెట్టిన ఆ డబ్బు పైన మమకారం తెంచుకోలేక ఆడబ్బుపూడ్చిన చోటే పడుకొన్నాడని చెప్పుకొన్నారంతా.

మూడు వర్గాలవారు పాడుపడ్డ సత్రందగ్గర వొకరి నొకరు చూచుకొని విస్తుపోయి, నవ్వు తెచ్చుకొన్న మొహాలతో పలకరించుకొన్నారు.

"పాపం ముష్టివాడు జబ్బు పడ్డాట్ట—చూచి పోదామని—"

'అవును. వూరిని నమ్ముకొని పడున్నవాడు కదాని—'

'పైగాఅతనికి మానాయకుడంటే అభిమానం. మానాయకుడి సానుభూతి సందేశాన్ని అందచేద్దామని...'

మూడు వర్గాలవారు లోపలికెళ్లారు.

ముష్టివాడు పగిలిన గచ్చుపై పడుకొని వున్నాడు. అతనికి ప్రక్కన కొడిగట్టబోతున్న గుడ్డిదీపం గుప్పు గుప్పు మంటూ వెలుగుతోంది. కిష్టయ్య మంచినీళ్లు గాబోలు తాగిస్తున్నాడు.

'అప్పుడే వచ్చాడే వీడు!' అనుకున్నారు మూడు వర్గాలవారు. అందులో వోపెద్ద వుండబట్టలేక వ్యంగ్యంగా ఆ మాటఅడగనే అడిగాడు.

ముష్టివాడు యిందరు ప్రముఖులు తనదగ్గరికి రావటంచూచి తబ్బిబ్బు పడ్డాడు. లేనివోపిక తెచ్చుకొని లేచినిల్చున్నాడు. తనమురికిబట్టలతో గచ్చుతుడిచి కూర్చోమని మర్యాదచేశాడు.

ముక్కు మూసుకొని యిచ్చకం మాటలు మాట్లాడేరు పెద్దలు. వాళ్లకావాతావరణం భరించటం దుర్భరంగా వుంది. త్వరగా బయట పడాలనివుంది. కానిఎలా?

తను వేళ్తే అవతలివాడు ఆ ఛాన్సు కాస్తా కొట్టేస్తాడేమో!

"ఇక వెళ్దామా మనం—"

"పనుండేమో తమరు పోతుండండి. నేను కాసేపు కూర్చుని వస్తాను—"

"అహా...నాకుమాత్రం పనేముందికనుక. వాడు విశ్రాంతి తీసుకొంటాడనీ..."

అలా వొకరి కందకుండా వొకరు కాస్సేపు మాట్లాడు కొన్నారు. గంటయింది. ఎవరూ కదలరు.

చివరి కెలాగైతేనేం? ఆ పూట పని పూర్తికాదని మూడు వర్గాల వారికి తెల్సింది. వెళ్లటానికి నిర్ణయించుకొన్నారంతా వొక్కసారిగా.

"వెళ్లొస్తాన్నా. మళ్లీ రెండు రోజులాగి వస్తాన్లే—" అన్నాడొకపెద్దమనిషి పెద్దగా. అందరూ వినేలా. తను అక్కడికి రెండు రోజుల దాకా రానని మిగతా వాళ్ళకు తెల్పాలని ఆయన వుద్దేశ్యం.

"నేనూ వెళ్తారా. అప్పుడప్పుడూ వస్తుంటాలే. మన డాక్టరు జనార్దనంగారిని పంపిస్తాలే—"

"మందుమాత్రం పుచ్చుకొంటూండరోయ్. ఏదన్నా అవసరముంటే నాకు కబురు పంపించు. నేను నాలుగు రోజులకో మారొచ్చి చూచిపోతుంటాలే—"

అవతలవాడిని మోసం చేశామని అనుకొంటూ ముగ్గురూ బయటపడ్డారు.

కాని వారు మోసం చేసింది—వారిని వారినే అని, ఆ మర్నాడు పొద్దున అంతా సత్రం దగ్గర మళ్ళీ కల్సుకొన్నప్పుడు వారికే తెల్సింది.

ఒకర్ని వొకరు చూచుకొని ఆశ్చర్యపోయి, ఏదో అటు పోతూ అక్కడికొచ్చినట్లు నటించి, ముష్టివాడిని చూడకుండానే ముగ్గురూ వెళ్లిపోయారా పూట.

ఆ తర్వాత ఎలాగైతేనేం. ముష్టివాడిని మూడు వర్గాల మనుషులు విడి విడిగా కల్సుకొని తను కోరికను తెలియచేశారు. తాము తల పెట్టిన కార్యాలు ఎంత గొప్పవో వుపన్యాసాలిచ్చారు.

అందరికీ ముష్టివాడి సమాధానం వొకటే—

'అడుక్కొని మీ దయా ధర్మాల మీద బతికే ముష్టి ముండాకొడుకుని. నా దగ్గర డబ్బెక్కడిది మహారాజులో...'

మూడు వర్గాలు ఏకమై ఎన్నో విధాల చెప్పి చూచారు. ఊరి శ్రేయస్సు, ప్రజల శ్రేయస్సు కోసం తామెంత పరిశ్రమిస్తున్నదీ బోధించారు. అతని డబ్బు ఎలా సద్వినియోగం చేసేదీ వివరించారు.

అన్నిటికీ సమాధానం ఒక్కటే. 'నా దగ్గర డబ్బులేదు మహరాజులో...నా మాట నమ్మండి.'

ఊరి పెద్దలకు కోపం వచ్చింది— డబ్బు యివ్వనందుకే కాదు. తమ మాట కాదన్నందుకూడా.

నామం అక్కరకు రానప్పుడు దండ ప్రయోగం చేయ నిశ్చయించారు. మూడు వర్గాలవారు కల్సి మళ్ళీ వెళ్ళేరు— కాళ్లు వేసుకొని. అదే సమాధానం.

'డబ్బెక్కడ దాచావ్?'

'అసలు లేదు మహారాజులూ.'

'అయితే సంపాదించిందంతా ఏం చేశావ్?'

ముష్టివాడో నిముషం మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అన్నాడు 'ఎట్టాగొచ్చిందో అట్టాగే పోయింది.'

పెద్దలకు కోపం కట్టలు తెంచుకొంది.

"పోయిందా? ఎక్కడికి?"

"ఎక్కడినుంచి వచ్చిందో అక్కడికే మారాజులు—"

"అయితే ఆ మూటల్లో ఏం దాచేవ్?...... మాట్లాడవేం?"

"అందులో డబ్బు లేదుబాబులూ అందులో నా కష్టంవుంది. తృప్తి వుంది"

"విప్పి చూపించు"

ముష్టివాడు అందరివైపు దీనంగా చూచాడు. చేతులు జోడించి తల అడ్డంగా వూపేడు. కళ్ళ వెంట నీళ్ళు.

"అయితే మూటలు బయటపెట్టనంటావ్?"

"బాబులూ......నన్ను పెళాంతంగా చావనివ్వండి. నా మనసును కట్టబెట్టకండి—"

దీనంగా, బిగ్గరగా అరిచేడు ముష్టివాడు.

"సరే ఆ డబ్బెక్కడికి పోతుందో మేము చూస్తాంగా. చచ్చాకైనా ఆ డబ్బు మా వూరికే చెందుతుంది—"

పెద్దలు కోపంగా వెళ్ళిపోయారు.

చస్తాడనుకొన్న ముష్టివాడు నాలుగు రోజుల తర్వాత తేరుకొన్నాడు.

దేహం బతికిందన్న మాటేకాని, మానసింగా చచ్చిపోయాడు. మునపటి హుషారు లేదు అతనిలో. దిగాచిక్కిపోయి చూట్టానికిభయంకరంగా వున్నాడు.

అంతకుముందు ఆ వూళ్లో వాళ్లంతా తన వాళ్ళేననుకున్నాడు. యిప్పుడు ఎవర్ని చూచినా అనుమానం.

మునుపు అప్యాయంగా చూచిన వాళ్ళుకూడా యిప్పుడతన్ని అసహ్యించుకోసాగేరు ఆ వూరి గొప్పతనానికి ముష్టివాడు మాయని మచ్చఅని విసుక్కోసాగేరు.

అతన్నిప్పుడు కాస్తో కూస్తో అభిమానంగా చూచేవాళ్ళు ఆ ముగ్గురే—కిల్లీ కొట్టు కిష్టయ్య, సైకిలుషాపు మాలీషా, కాకా కొట్టు జాను.

* * *

కిష్టయ్య కొట్టు కట్టేశాడు. ఒక్క నిముషం ఆలోచించి అటూ ఇటూచూచి సైకిలెక్కేశాడు.

ముష్టివాడు రెండు రోజులయ్యింది బస్సు స్టేండుకొచ్చి. రాకపోవటానికి కారణం ఏమైనట్లు?

కిష్టయ్య యీ రెండు రోజుల్లో చాలాసార్లు ముష్టివాడుండే చోటికెళ్ళి, మళ్ళీ జ్వరం వస్తే తనింటికే తీసుకువద్దామనుకున్నాడు. కాని వూరి పరిస్థితిని చూచి భయపడ్డాడు.

ఊళ్లో పెద్దలు ముష్టివాడిమీద పగ బట్టేరు. చాలా మంది కళ్ళు అతని చావుమీదే వున్నాయి. వాడి కదలికలను ఎప్పటి కప్పుడు గమనిస్తూనే వున్నారు.

తాను వెళ్తే తనకి ముప్పురావచ్చు. తనమీన నిఘాపెట్టవచ్చు.

సైకిలు వేగంగా నడుస్తోంది. అంత కన్నా వేగంగా పరుగెత్తుతున్నాయి కిష్టయ్యఆలోచనలు.

ముష్టోడికి మళ్ళీ రోగం రాలేదు కదా? అసలు... అసలు వాడీసరికే వచ్చి పోలేదుకదా?

కిష్టయ్య కాలు పెడలు మీద నుంచి జారింది. కింద పడబోయి నిలదొక్కుకొన్నాడు.

వాడు చచ్చిపోయి వుంటే యింకేముంది? యీసరికే వాడి డబ్బంతా కాజేసుంటారు—వూరి పెద్దలో, మాలీషానో, జానో.

వేగం హెచ్చించాడు కిష్టయ్య.

నిజానికి ముష్టివాడి డబ్బు అంతా కాకపోయినా కొంతైనా తనకొస్తుందన్న నమ్మకం కిష్టయ్యకు మొదటినుంచీ వుంది.

ఎన్నో విధాల తను ముష్టివాడికి ఆప్తుడు. తనంటే వాడికిష్టం. లేకపోతే వూరికే తనకి సేవచేస్తాడా? కాగా అడపా దడపా బీడీముక్క తను యిస్తూనే వచ్చాడు. రోగానపడ్తే ఆదుకొంటూనే వచ్చాడు. తనకన్నా కావల్సినవాళ్ళు ముష్టివాడి కెవరున్నారీవూళ్ళో? కాగా తనకి వాడి డబ్బును అనుభవించే హక్కువుంది. తను నిజానికి ముష్టివాడి డబ్బుకు న్యాయమైన వారసుడు.

యిలా ఆలోచించుకొని ఎంతో ధైర్యంగా. ఆశగావున్నాడు కిష్టయ్య మొదటినుంచీ. అయితే సైకిలు కొట్టు మాలిషా, కాకాకొట్టు జానుకూడా యిలాగా ఆలోచిస్తున్నారని, ఆశలు పెట్టుకొన్నారనిఅతను ఊహించలేదు. ఎప్పుడన్నా ఆ వూహ వొచ్చినా 'వాళ్లమొహంలే' అనుకొనేవాడు.

కాని మూడేళ్ల క్రితం పెద్దమనుషుల గొడవ జరిగిన దగ్గర్నుంచి అతనికి భయం పట్టుకొంది. ఆ డబ్బు తనక్కాకుండా వాళ్లు ఎగర తన్నుకుపోతారేమో.

ఊళ్లో మూడువర్గాల ఆశకు. ఆలోచనలకు చిహ్నంగా. మూడేళ్లక్రితం ఎలక్షన్లకు ముందు చేసిన కాలేజీ శంకుస్థాపన రాయి. శివాలయం స్థలంలో శివలింగం లాంటి వోరాయి. కేంద్ర నాయకుడి విగ్రహ శంకుస్థాపనరాయి. అలాగే వున్నాయి. ముష్టివాడు చావాలి— వాడి డబ్బుతో ఈ మూడు పూర్తికావాలి.

తను న్యాయాన్యాయాలు ఆలోచిస్తూ, మీనమేషాలు లెక్కిస్తూ కూర్చుంటేకాదు. దీపం వుండగానే యిల్లు చక్కదిద్దుకోవాలి.

సైకిలు సత్రం దగ్గర ఆగింది.

లోపలికెళ్లి ముష్టివాడి పక్కన నిల్చొని వున్న జానునుచూచిఛటుక్కు మన్నాడు కిష్టయ్య అటుపక్కకు తిరిగే సరికి మాలీషా

"అయితే మీరప్పుడే వచ్చేశా రన్నమాట!"

'నువ్వూ వచ్చేశావుగా?'

వారి ఆలోచనలు అర్థమయ్యాయి. తనకు పోటీకొచ్చి తనే పోటీ కొచ్చినట్లు అసహ్యించుకొంటున్నారు— తనని చూచి.

బహుళ పక్షం—

ఆకాశంఅన్యాయంలా నల్లగా వుంది. ఆశలా నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నాయి. అధర్మపు గాలి వెచ్చగా వీస్తోంది.

ఊళ్లో వోమూల కుక్కలు వో పుల్లిస్తరాకు కోసంకొట్లాడుకొంటోంటే: ఆకలితో చస్తోన్న వో అభాగ్యుడు ఆశగా ఆ ఆకువైపు చూస్తున్నాడు, యింకో వీధిలో దారిన పోతున్న పందిమీదికి కుక్క "భౌభౌ" మంటూ దూకింది. సత్రం కలుగులో పొంచివున్న పాము కప్ప కోసం ఎదురు చూస్తోంది.

కిష్టయ్య ముష్టివాడి వైపు చూచాడు—

అతను కళ్లు మూసుకొని వున్నాడు. అతని ముక్కుల్లో నుంచి వచ్చే వుచ్ఛ్వాస నిశ్వాసాలు. పెరిగివున్న మీసం, గడ్డం పైనుంచివస్తున్నాయి

"డాక్టరుకు కబురు పంపించారా?" జవాబు లేదు.

మళ్లీ అదేప్రశ్న అడగాలనుకొని మానేసేడు కిష్టయ్య తననే వెళ్లమంటే? తను వెళ్లిన సమయానికే అతని ప్రాణం గుటుక్కు మంటే? అంతదాకా పోతే పోయింది సరికదా, భాగం కూడా రాదు. అంతా వాళ్లిద్దరే పంచేసుకుంటారు.

ఊరు బాగా మాటు మణిగింది, చీకటి వీరవిహారం చేస్తోంది.

ముష్టివాడు గట్టిగా మూలిగాడు. ముగ్గురూ ఆత్రంగా అతనివైపు చూచారు. అతను కళ్లు తెర్చి ముగ్గుర్నీ చూచాడు, ఆ కళ్లలో కొన ప్రాణం మరికాసేపులో ఆగిపోయేలా కన్పించింది ముగ్గురికీ

"డబ్బెక్కడ దాచేవ్?" జాన్

"ఇన్నాళ్లు మనం కల్సివున్నాం. స్నేహితులం మమ్మల్ని అన్యాయం చేస్తావా."

"పదిమంది పిల్లలు కలవాడిని నేను. నాబాధలు నీకు తెలీనిదేముంది?"

ముష్టివాడు ముగ్గురివైపు నమ్మలేనట్లు, అమాయకంగా చూచాడు. "మీరూ యింతేనా?" అన్నట్లు తర్వాత నవ్వేడు.

"నా డబ్బంతా యీ మూటల్లోనే వుంది. మీ ముగ్గురు తలా పదిమూటలు తీసుకోండి—"

కళ్ళు మూసుకొన్నాడు ముష్టివాడు.

ఆ ముగ్గురి ఆనందానికి అవధిలేదు.

తాము యిప్పటిదాకా దరిద్రులు. ముష్టివాడు కళ్ళు మూసిన మరుక్షణం అదృష్టం తమని వరిస్తుంది.

కాని యీలోగా వాళ్ళవస్తే! వారందరికీ ఈ విషయం తెలిస్తే? తమనోట దుమ్మే.

ముగ్గురూ ముష్టివాడివైపు చూచారు. ఉచ్ఛ్వాస. నిశ్వాసలు యింకా విన్పిస్తూనే వున్నాయి.

ఇంకా చావడేంవీడు?

ముగ్గురూ ఆలోచించారు రహస్యంగా—

ఎలాగూ వాడిలో చచ్చే చిహ్నాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆ చచ్చేది యిప్పుడేచస్తే తమకు లాభం......వాడివాళ చచ్చినా రేపు చచ్చినా వొకటే.

నిర్ణయమైపోయింది.

అన్నీ సిద్ధం చేసుకొని చివరిసారిగా నేలమీద పడివున్న వాడివైపు చూచారు.

కళ్ళగుడ్లు తెరుచుకొని వున్నాయ్. ఉచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దం ఆగిపోయింది.

ఆత్రంగా ముగ్గురూ ఎవరి పదిమూటలూ వారు తెంపుకొన్నారు మూటల్తోటే యింటికి పోతామనుకొన్నారు. కాని మూటలు ఎవరైనా చూస్తే· పైగా మూటల్లో ఎంత డబ్బు వుందో? ఆతృత ఆగింది కాదు.

శాంపిల్‌గా ముగ్గురూ తలా వొక మూట విప్పారు.

మూటలోవున్న వస్తువుని చూచి నోట మాట రాలేదు.

అంత పెద్ద మూటలో వున్నది వొకే వొక్క కాగితం. ఆ కాగితంలో ఫలానా రోజున ఫలానా వాడికి యింత డబ్బు పంపినట్లు, ఎందుకు పంపించిన వైనం వ్రాయబడి వున్నాయి.

ముప్ఫై మూటలు విప్పితే ముప్ఫై కాగితాలు దొరికాయి. పది వేలకు పైన డబ్బుకి లెక్క దొరికింది.

ముష్టివాడు దానం చేసిన వారిలో ఆ వూరి ప్రముఖులు. వారు నిర్వహించే సంస్థలు వున్నాయి. చదువుకొంటున్న పేద విద్యార్థులు వున్నారు. పెళ్ళిళ్లు కావల్సిన పేద పిల్లలు వున్నారు. మందులు కొనటానికి డబ్బు లేక బాధపడిన అభాగ్యులున్నారు. అన్నార్తులున్నారు ..దీన చరితులు...చరిత్ర హీనులు ఎందరో వున్నారు.

ముప్ఫై కాగితాల్లో తామొముగ్గురూ వున్నారు.

ముగ్గురూ అతనివైపు చూచారు.

తెరిచివున్న నోరు తమ అజ్ఞానాన్ని చూచి నవ్వుతున్నట్లుంది.

ఆర్పకుండా నిల్చివున్న కనుగుడ్లు తమ ఆశను దహించేలా చూస్తున్నట్లు తోచింది.

ఇటు తిరిగేసరికి వూరి పెద్దలు! వెనుక పటాలం. వాళ్ళచేతుల్లో గునపాలు

వారిని చూడగానే ముగ్గురికీ వొక్కసారే నవ్వొచ్చింది. నవ్వేరు. ఆ తర్వాత వొకర్నొకరు చూచుకొని బిగ్గరగా నవ్వసాగేరు.

"వచ్చారారండి. ముష్టివాడు మూటల్లో డబ్బు మీకు చేతల్తో యిమ్మన్నాడు యిదిగో తీసికోండి" అంటూ ముప్ఫైకాగితాలు వాళ్ళ గుప్పెట్లో వుంచాడు కిష్టయ్య.

★

